సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం, 2, అక్టోబర్, 2023



మిడ్‌మానేరులో 26 టీఎంసీలు

బోయినపల్లి: మిడ్‌మానేరులో 26.29 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎస్సారెస్పీ నుంచి 9వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, ఎల్‌ఎండీకి 3 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు.



ఉపాధ్యాయుడికి అవార్డు

బోయినపల్లి: మండలకేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను వాస్తురత్న అవార్డు వరించింది. ఆదివారం వరంగల్‌లో జరిగిన వైదిక విజ్ఞాన సదస్సులో అవార్డు స్వీకరించారు.

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మంత్రి హరీశ్‌రావును కలిసిన అంగన్‌వాడీలు



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

సిరిసిల్లటౌన్: మంత్రి హరీశ్‌రావును ఆదివారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జేఏసీ నేతలు కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె జరుగుతున్న తరుణంలో మంత్రి నివాసంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, జేఏసీ నేతలతో మంత్రి చర్చలు జరిపారు. అంగన్‌వాడీలకు సంబంధించి సీఎంతో మాట్లాడి పీఆర్సీ పెంచినప్పుడు వేతనాలు కూడా పెంచుతామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ జేఏసీ నేతలు అడిగిన విధంగా కాకుండా మంత్రి సత్యవతి రాథోడ్ చెప్పినట్లుగా అంగన్‌వాడీ వర్కర్‌కు రూ.2లక్షలు, హెల్పర్‌కు రూ.1లక్ష ఇవ్వాలని కోరగా.. మంత్రి పరిశీలిస్తామన్నారు. ఇతర డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇవ్వలేకపోవడంతో సమ్మె యథాతథంగా కొనసాగుతుందని అంగన్‌వాడీలు ప్రకటించారు. అనెల 4న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతామని పేర్కొన్నారు. జేఏసీ రాష్ట్ర నాయకురాళ్లు పి.జయలక్ష్మి, సునీత, కరుణకుమారి, సాయిశ్వరి, చందన తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమంతోనే దేశం అభివృద్ధి



మాట్లాడుతున్న సుగుణాకర్‌రావు

సిరిసిల్లటౌన్: రైతు సంక్షేమంతోనే దేశం అన్నిరంగాల్లో వృద్ధి సాధిస్తుందని కిసాన్ గ్రామీణ మేళా ఉమ్మడి జిల్లా కన్వీనర్ పి. సుగుణాకర్‌రావు అన్నారు. ఈనెల 9 నుంచి మూడ్రోజుల పాటు కరీంనగర్ పద్మనాయక కల్యాణ మండపంలో జరిగే గ్రామీణ కిసాన్ మేళా పోస్టర్‌ను సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సిరిసిల్ల నేత కార్మికులకు బతుకమ్మ చీరల ద్వారా తక్కువ రోజులు పనిదొరుకుతుందని, వారికి నిరంతర ఉపాధి అందేలా చూడాలని మంత్రి కేటీఆర్‌ను కోరారు. డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు అందించాలన్నారు. నాయకులు ఆడెపు రవీందర్, గాజుల వేణు, వెంకట్‌రెడ్డి, కమలాకర్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్చకులు నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

వేములవాడ: ధూపదీప నైవేద్యం ఆలయాల అర్చకులు నియమ, నిబంధనలు పాటించాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. రాజన్న ఓపెన్‌స్లాబ్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లా ధూపదీప నైవేద్య అర్చకుల శిక్షణా తరగతులను ప్రారంభించి మాట్లాడారు. పంచరాత్ర ఆగమం, మధ్యాహ్నం భోజనానంతరం వీరశైవ ఆగమం, ఆలయంలో పాటించాల్సిన నియమాలు, భస్మం ఎందుకు ధరించాలి, నిత్య పూజల కైంకర్యాలు నిర్వహించే విధానం, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. నిత్య దూపదీప నైవేద్య అర్చకులుగా నియమితులైన వారు మూడు రోజులు నిర్వహించే శిక్షణ తరగతుల ద్వారా అన్ని విషయాలు తెలుసుకుని వారివారి ఆలయాల్లో క్రమశిక్షణతో నిత్యం పూజా విధానం నిర్వహించి స్వామివారికి ధూపదీప నైవేద్యం సమర్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఉడుతల వెంకన్న, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, వీరశైవాగమ పండితులు మోహనప్ప ఆనందయ్య, ఆకవరం మఠం శివప్రసాద్, నాగయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఏక్ రుపియా వాలా 2.0

- రెండేళ్లలో రూ.వందల కోట్లకు పడగలెత్తిన వ్యాపారి
- కరీంనగర్ నుంచి నేరుగా తమిళనాడుకు పీడీఎస్ రైస్
- సైకిళ్ల నుంచి గూడ్స్ రైళ్లలో తరలించే స్థాయికి ఎదిగిన వైనం
- రెండేళ్ల క్రితం డీజీపీ కార్యాలయం ఆగ్రహంతో అండర్‌గ్రౌండ్‌కు..
- మిల్లర్లతో కుమ్మక్కై సీఎమ్మార్ బియ్యం కూడా ఎగుమతి
- 'పుష్ప' తరహాలో మహారాష్ట్ర, తమిళనాడుకు విస్తరించిన నెట్‌వర్క్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అడవిలో చెట్లు కొట్టుకునే కూలోడు అంతర్జాతీయ స్మగ్లర్‌గా ఎదిగిన కథ 'పుష్ప' సినిమా. వాస్తవానికి అలాంటి ఘటనలు నిజజీవితంలో జరగవు. కానీ.. ఉమ్మడి కరీంనగర్‌లో పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి.. అధిక ధరలకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే వ్యాపారిని చూస్తే నిజమే అనిపిస్తోంది. 'ఏక్ రుపియావాలా' కోడ్ నేమ్‌తో అధికారులు ముద్దుగా పిలుచుకునే ఈ స్మగ్లర్ నెట్‌వర్క్ ఒకప్పుడు పాత కరీంనగర్ జిల్లాకే పరిమితం. నేడు ఇతర రాష్ట్రాలకు విస్తరించింది. రెండేళ్ల క్రితం ఉమ్మడి జిల్లా దాటి మహారాష్ట్రలో ఎంటర్ అయ్యాడు. ఆ సమయంలో అతడి దందా.. పీడీఎస్ బియ్యాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్న తీరును 'సాక్షి' దినపత్రిక 'ఏక్ రుపియావాలా' శీర్షికన వరుస కథనాలు ప్రచురించింది. ఈ కథనాలపై డీజీపీ కార్యాలయం స్పందించి దాడులకు ఆదేశించింది. అప్పటి కరీంనగర్ సీపీ సత్యనారాయణ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ బృందాలు వరుస దాడులతో విరుచుకుపడ్డాయి. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న పలువురిని బైండోవర్ కూడా చేశాయి. దీంతో కొంతకాలంపాటు సదరు వ్యాపారి, అతని అనుచరులు కార్యకలాపాలు నిలిపివేశారు.

ఫిర్యాదు వచ్చింది చర్యలు తీసుకుంటాం

కరీంనగర్ నుంచి తమిళనాడుకు సీఎంఆర్ బియ్యం అక్రమంగా వెళ్తున్నాయని మాకు అధికారికంగా ఫిర్యాదు వచ్చింది. వెంటనే అడిషనల్ కలెక్టర్, సివిల్ సప్లయీస్ ఉన్నతాధికారులకు చేరవేశాను. వారు స్పందించి రంగంలోకి దిగారు. అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

– రవీందర్ సింగ్, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్

సైకిళ్లతో మొదలై.. గూడ్స్ రైళ్లలో తరలించే స్థాయికి..

ఒకప్పుడు గ్రామాల్లో సైకిళ్లపై తిరుగుతూ.. పీడీఎస్ బియ్యాన్ని సేకరించి వాహనాల్లో తరలించడంలో ఏక్ రుపియావాలాది అందెవేసిన చేయి. అప్పట్లో హుజూరాబాద్ ఉప ఎన్నిక, ఎమ్మెల్సీ ఎన్నికలు వరుసగా రావడం.. పత్రికల్లో వరుస కథనాలు రావడంతో అతడి వ్యాపారం సుప్తావస్థలోకి వెళ్లింది. ఆ తర్వాత కొత్త పద్ధతిలో వ్యాపారంలోకి దిగాడు. అధికారులకు లంచాలిస్తూ.. మహారాష్ట్రకు బియ్యం తరలించడం కన్నా అధికారికంగానే ఎగుమతి చేయాలని నిర్ణయించాడు. అదునుకోసం చూస్తున్న అతడికి తమిళనాడు రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వానికి బియ్యం కోసం చేసిన వినతి ఆసరాగా దొరికింది. రూ.37.50కు కిలో చొప్పున కావాలని తమిళనాడు కోరడం.. ఆ డీల్ రద్దు కావడంతో 'ఏక్ రుపియావాలా' రంగంలోకి దిగాడు. కిలో రూ.31.50కే ఇస్తామని డీల్ కుదిర్చినట్లు సమాచారం. ఎగుమతికి కావాల్సిన బియ్యంలో తనవంతుగా పీడీఎస్ రైస్ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. అతడికి కావాల్సినంత బియ్యం ఇచ్చేందుకు ఉమ్మడి జిల్లాలోని పలువురు రైస్‌మిల్లర్లు సమ్మతించారని తెలిసింది. ఇందులో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బియ్యమే ఉన్నట్లు తెలిసింది. వారం వ్యవధిలో దాదాపు ఐదు వేల టన్నులు కరీంనగర్ నుంచి గూడ్స్ ద్వారా ఎగుమతి చేసినట్లు, వీటి విలువ దాదాపు రూ.160కోట్ల వరకు ఉంటుందని సమాచారం. డిమాండ్ నేపథ్యంలో మరో రూ.60 కోట్ల విలువైన రెండు వేల టన్నులు తరలించేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకు మరో గూడ్స్ రైల్ రేక్‌ను ఇప్పటికే బుక్‌చేశారని సమాచారం. ఇంత జరుగుతుంటే ఇటు సివిల్ సప్లయీస్ అధికారులు, పోలీసులకు సమాచారం లేకపోవడం గమనార్హం.

అటెన్షన్ డైవర్షన్‌లో అందెవేసిన చేయి..

తెలంగాణ, మహారాష్ట్రలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలో 'ఏక్ రుపియా వాలా'ది అందె వేసిన చేయి. అచ్చం వీరప్పన్ తరహాలో.. పోలీసులు బందోబస్తుల్లో నిమగ్నమయ్యే సందర్భాల్లోనే భారీ వాహనాల్లో టన్నుల కొద్దీ బియ్యం రాష్ట్ర సరిహద్దులు దాటిస్తాడు. ఇపుడు బహిరంగ దందా చేస్తున్న నేపథ్యంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకున్నాడు. తమపై సివిల్ సప్లయీస్, పోలీసుల కన్ను పడకుండా.. గణేశ్ ఉత్సవాల్లో అధికారులు తలమునకలైన సందర్భాన్ని వాడుకుని రైలు ద్వారా తెలివిగా.. పకడ్బందీగా తమిళనాడుకు బియ్యం ఎగుమతి చేశాడు. త్వరలో ఎన్నికల కోడ్ రాబోతోంది. కోడ్ వస్తే వాహన తనిఖీలు పెరుగుతాయి. దానికి ముందే రెండో విడత సరుకును పంపేలా ఏర్పాట్లు పూర్తయ్యాయని సమాచారం. కిలోకు రూపాయి బియ్యాన్ని రూ.4 లేదా రూ.5 కమీషన్ చొప్పున విక్రయించే 'ఏక్ రూపియా వాలా' నేడు రూ.వందల కోట్ల వ్యాపారానికి పడగలెత్తిన తీరు సినిమా కథను తలపిస్తోంది.

వృద్ధులు ఆత్మగౌరవంతో జీవించాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్ల: వృద్ధులు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం ఆసరా పెన్షన్లతో అండగా నిలుస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా వయోవృద్ధులు ఆత్మగౌరవంతో జీవించేలా రూ.2,016 ఆసరా పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదన్నారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, మండెపల్లిల్లో ఓల్డ్ ఏజ్ హోమ్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, వయోవృద్ధులకు ఫిజియోథెరపీ సేవలను పీహెచ్‌సీల్లో అందుబాటులోకి తెచ్చారని గుర్తు చేశారు. వయోవృద్ధుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. వయోవృద్ధుల సంరక్షణకు 2007లో ప్రభుత్వం తెచ్చిన చట్టంపై సిరిసిల్ల ఆర్డీవో ఎస్.ఆనంద్‌కుమార్ తెలిపారు. వయోవృద్ధుల హెల్ప్‌లైన్ నంబరు 14567 గురించి జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం వివరించారు. సీనియర్ సిటిజన్స్ ఓటు హక్కు వినియోగించుకోవాలని, వారికి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వసతులను డీఆర్‌డీఏ ఏపీడీ నర్సింహులు వివరించారు. ఇటీవల మలేషియాలో మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో రజత పతకం సాధించిన సిరిసిల్లకు చెందిన టమటం రామానుజమ్మను, వయోవృద్ధులకు ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ సన్మానించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, కార్యదర్శి డాక్టర్ జనపాల శంకరయ్య, కోశాధికారి వెల్దండి దేవదాస్, సఖీ కేంద్రం కోఆర్డినేటర్ రోజా, సీడీపీవోలు ఆనందిని, సుచరిత, పద్మ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని వ్యాఖ్యలు సిగ్గుచేటు

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



ప్రెస్‌మీట్లో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

సిరిసిల్లటౌన్: మహబూబ్‌నగర్ సభకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రానికి మంచి వరాలు కురిపిస్తారనుకుంటే.. ఆయన చేసిన వ్యాఖ్యలు మాత్రం ఉపయుక్తంగా లేవని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి సిరిసిల్లలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో మాట్లాడారు. ప్రధాని ప్రకటించిన పసుపుబోర్డు, ట్రైబల్ యూనివర్సిటీలు తప్పకుండా తెలంగాణాలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర విభజన చట్టంలో స్పష్టంగా ఉందన్నారు. ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్ తదితర ముఖ్యనేతలు ప్రధానిని నిలదీసి కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులకు జాతీయ హోదా తీసుకురావాలని సవాల్ విసిరారు. ఎన్నికల నేపథ్యంలో బుందేల్‌ఖండ్‌కు జాతీయ హోదా కల్పిస్తూ రూ.45వేల కోట్లు అందించారన్నారు. పాలమూరు సభకు హాజరైన ఆయన ఆ ప్రాంతంపై, తెలంగాణ అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా పాలమూరు ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జెడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లకు అధునాతన రైలుమార్గం

రాష్ట్ర ప్రభుత్వం చొరవతో సిద్దిపేట వరకు రైలుమార్గం పూర్తయిందని, సిరిసిల్ల వరకు ఆధునిక టెక్నాలజీతో రైలు మార్గం రాబోతుందని వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో మాట్లాడారు. సిరిసిల్ల రైలుమార్గం నిర్మాణానికి మంత్రి కేటీఆర్ చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. మిడ్‌మానేరు కిలోమీటర్ పొడవుతో రైల్వే బ్రిడ్జి నిర్మితం కానుందని, ఒకే వంతెనపై రైలు, వాహనాల రాకపోకలకు బ్రిడ్జిని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

గంగాధరుడి చెంత.. నీటి చింత

- నందీశ్వర, లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌ల్లో నిలిచిన నీటి సరఫరా
- రెండు కాంప్లెక్స్‌ల్లో గదులు ఖాళీ.. ప్రైవేట్ లాడ్జిలదే హవా




రాజన్న భక్తులకు వసతి కల్పించే నందీశ్వర కాంప్లెక్స్

వేములవాడ: సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రాజన్న భక్తులకు వసతి గదుల్లో నీటి కష్టాలు పెరిగిపోయాయి. వరుస సెలవులు రావడంతో కుటుంబ సభ్యులతో రాజన్నకు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. గంగ ఒదిగిన గంగాధరుడిగా పేరున్న రాజన్న సన్నిధిలోని నందీశ్వర కాంప్లెక్స్, లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లలో మూడురోజులుగా నీటి సరఫరా నిలిచిపోయి ంది. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ వసతి గదులు ఇవ్వడాన్ని నిలిపివేశారు. అధికారులే నీటి సౌకర్యంలేదని చెప్పి భక్తులను తిప్పి పంపిస్తున్నారు. గత్యంతరం లేక భక్తులు ప్రైవేట్ లాడ్జిలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న ప్రైవేట్ లాడ్జిల యజమానులు అందినంత దండుకుంటున్నారు. దీంతో భక్తుల జేబులు ఖాళీ కావడంతోపాటు రాజన్న ఆదాయానికి భారీగా గండిపడుతోంది. నీటి సరఫరాపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు అంటున్నారు.

రెండు కాంప్లెక్స్‌ల్లో..

మూడు రోజులుగా నీటి సరఫరాలో ఏర్పడిన అంతరాయం వల్ల రాజన్న వసతి గదులైన నందీశ్వర కాంప్లెక్స్‌లో 64, లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లో 94 గదులు ఖాళీగా ఉండిపోతున్నాయి. కేవలం నీటి సరఫరా లేకపోవడం వల్ల గదులను అద్దెకు ఇవ్వకుండా అలాగే ఉంచేస్తున్నారు. దీంతో భక్తులు పెద్ద మొత్తంలో నష్టపోతున్నారు.

నీళ్లు లేకుండా ఎలా ఉంటాం



మేము కుటుంబంతో రాజన్నను దర్శించుకునేందుకు శనివారం వచ్చినం. నందీశ్వర కాంప్లెక్స్ ఫస్ట్‌ఫ్లోర్‌లో రూమ్ ఇచ్చారు. వచ్చినప్పటి నుంచి నీళ్లు లేవు. నీళ్లు లేకుండా ఎలా ఉండడం. చివరికు వాటర్ బాటిల్ తెచ్చుకుని కాలం వెల్లదీశాం. డబ్బులు చెల్లించి ఇబ్బందులు పడ్డాం.

– రాజేశ్వరి, భక్తురాలు, వరంగల్

పైప్‌లైన్ మరమ్మతు చేయిస్తాం



ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టిన రోడ్డు పనుల వల్ల తమ పైప్‌లైన్ దెబ్బతిన్నది. రెండు రోజుల్లో మరమ్మతు చేయించి భక్తులకు నీటి సరఫరా కల్పిస్తాం.

– రాజేశ్, ఈఈ

టీచర్ల తప్పుల దిద్దుబాటు

- ర్యాంకుల గోల్‌మాల్‌పై స్పందించిన డీఈవోలు
- 'సాక్షి' వరుస కథనాలపై కదలిన విద్యాశాఖ
- స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపైనా మొదలైన చర్యలు
- అన్ని డీఈవో కార్యాలయాల్లో స్పౌజ్ ఆప్షన్ల వెరిఫికేషన్లు



కరీంనగర్‌లో వెరిఫికేషన్‌కు హాజరైన స్పౌజ్ టీచర్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: టీచర్ల బదిలీలు, పదోన్నతులు సందర్భంగా వెలుగుచూసిన ర్యాంకుల గోల్‌మాల్, స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపై విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఇటీవల జీహెచ్ఎం బదిలీలలో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగం అవుతున్న తీరును, టీచర్ల పదోన్నతులు–బదిలీల సందర్భంగా దరఖాస్తుల్లో డీఎస్సీ ర్యాంకులను తప్పుగా నమోదు చేసిన వైనాన్ని 'సాక్షి' గతనెల 23న 'స్పౌజ్ దుర్వినియోగంపై గుర్రు', 29న 'టీచర్ల బదిలీల్లో ర్యాంకుల గోల్‌మాల్' శీర్షికలతో వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో టీచర్లు చేసిన తప్పులను సరిదిద్దేందుకు చర్యలు ప్రారంభించారు. ప్రస్తుతం జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో జాబితాలను అధికారులు సవరించారు. సిరిసిల్ల జాబితాను సవరించాల్సి ఉంది.

డీఈవో కార్యాలయాల్లో స్పౌజ్ వెరిఫికేషన్..

స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపై పాఠశాల డైరెక్టర్ దేవసేన ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డీఈఓ కార్యాలయాలు అప్రమత్తమయ్యాయి. స్పౌజ్ కింద దరఖాస్తు చేసుకున్న టీచర్లంతా డీఈవో కార్యాలయాల్లో ఆదివారం వెరిఫికేషన్‌కు రావాలని సూచించింది. అందరి ఆప్షన్లను వెరిఫికేషన్ చేసి అందులో నిబంధనలకు విరుద్ధంగా స్పౌజ్‌కు దూరంగా ఆప్షన్ ఇచ్చినవారందరినీ సమీపంలోని స్కూల్‌కు ఆప్షన్‌ను ఎడిట్ చేసుకోవాలని డీఈవోలు ఆదేశించారు. దీంతో అనివార్యంగా వారంతా సమీపంలోని పాఠశాల వద్దకు ఆప్షన్ ఇచ్చుకున్నారు. ఇష్టంలేనివారు 'నాట్ విల్లింగ్' ఇచ్చుకున్నారు. కరీంనగర్‌లో 56 మంది, జగిత్యాలలో 66 మంది, పెద్దపల్లి 33 మంది, సిరిసిల్లలో 37 మంది స్పౌజ్‌లు వెరిఫికేషన్ పూర్తిచేసుకున్నారు.

గోల్‌మాల్ ర్యాంకులు సరి

పదోన్నతులు, బదిలీ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, జగిత్యాలలో పలు తప్పులు దొర్లాయి. కొందరు టీచర్లు తాము కోరుకున్న పదోన్నతి, ఇష్టమైన చోటుకు బదిలీ దక్కేలా చక్రం తిప్పారు. 317 జీవో అమలు సందర్భంగా డీఎస్సీ ర్యాంకును ప్రామాణికంగా కేటాయింపులు చేపట్టారు. ఇప్పుడు కూడా అవే ర్యాంకులు ప్రామాణికంగా తీసుకుంటున్నారని తెలుసుకున్న టీచర్లు.. తమ డీఎస్సీ ర్యాంకులను హెచ్‌ఆర్‌ఎంఎస్ సైట్‌లో తప్పుగా చూపించారు. ఈ విషయంలో కొన్ని జిల్లాల్లో ఉన్నతాధికారులను విజయవంతంగా తప్పుదోవ పట్టించారు. ఈ పరిణామాలను 'సాక్షి' వెలుగులోకి తేవడంతో ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. తప్పుడు ర్యాంకులు చూపిన టీచర్లకు నోటీసులు పంపి వివరణ కోరారు. అలాగే తప్పుగానమోదైన ర్యాంకులను తిరిగి సరిదిద్దుతున్నారు.

బదిలీలు
(గణిత ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టు)

జిల్లా	సీనియారిటీ సంఖ్య	ప్రస్తుత ర్యాంకు	317 జాబితా ర్యాంకు
జగిత్యాల	02	675	2163
జగిత్యాల	25	685	2191
జగిత్యాల	31	334	681

- పై పట్టికలో చూపినవే కాకుండా పదుల సంఖ్యలో తప్పుగా నమోదుచేసిన ర్యాంకులను డీఈవో కార్యాలయాలు ఇప్పుడు సరిచేశాయి. 317 జీవో అమలు సందర్భంలో ఉన్న ర్యాంకులనే ఉంచి, వాటినే ప్రామాణికంగా బదిలీలు, పదోన్నతులు చేపట్టనున్నారు. తప్పుడు ర్యాంకులను సవరించి, పాత ర్యాంకులను ప్రామాణికంగా తీసుకుంటున్న జగిత్యాల డీఈవో జగన్మోహన్‌రెడ్డికి ఎస్టీయూ అధ్యక్ష కార్యదర్శులు బైరం హరికిరణ్, మచ్చ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

సిరిసిల్లలో స్వచ్ఛ చైతన్యం

సిరిసిల్లటౌన్: పరిశుభ్ర పట్టణం సిరిసిల్లలో స్వచ్ఛ చైతన్యం వెల్లివిరిసింది. గాంధీ జయంతి, ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఆదివారం సబ్బండ వర్గాలు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వచ్ఛతాహీ సేవ– 2023లో భాగంగా మున్సిపల్ పరిధిలోని 39 వార్డుల్లో 'ఏక్ తారీఖ్.. ఏక్ గంట ఏక్ సాథ్' కార్యక్రమం నిర్వహించినట్లు చైర్‌పర్సన్ జిందం కళ తెలిపారు. అన్ని వార్డుల్లో కౌన్సిలర్లు చెత్తపేరుకు పోయిన ప్రదేశాలను శుభ్రం చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గాంధీచౌక్‌లో సిరిసిల్ల ఎస్బీఐ చీఫ్ మేనేజర్ పీఎస్ వీరాంజనేయులు ఆధ్వర్యంలో కూడలి శుభ్రం చేయగా, డెప్యూటీ మేనేజర్ రాజేంద్రప్రసాద్, గోలి శ్రీనివాస్, గోపి, రహమాన్, అమీర్ పాల్గొన్నారు. ప్రధాని పిలుపు మేరకు స్వచ్ఛాంజలి స్వచ్ఛ భారత్ 2.0 కార్యక్రమాన్ని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. పాతబస్టాండు పరిసరాలను నాయకులు శుభ్రం చేయగా, ఆడెపు రవీందర్, రెడ్డబోయిన గోపి, గాజుల వేణు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో చైర్‌పర్సన్ కళ



పాతబస్టాండులో బీజేపీ ఆధ్వర్యంలో..

రాజన్నకు వీకెండ్ తాకిడి



వేములవాడ: వేములవాడ రాజన్నకు వీకెండ్ తాకిడి పెరిగిపోయింది. ఆదివారం 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.20 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



క్లుప్తంగా

మంత్రి సభను విజయవంతం చేయాలి



సభ స్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రసమయి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఈ నెల 6న జరిగే మంత్రి హరీశ్‌రావు సభను విజయవంతం చేయాలని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఆదివారం సభా వేదిక స్థలాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మండల ముదిరాజ్ సంఘం సభ్యులతో మాట్లాడారు. జంగంరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ గంగాధర కిష్టయ్యకు మాతృవియోగం జరగగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

నడవలేని స్థితి.. ఇంటి వద్ద కేవైసీ



వృద్ధురాలి వేలిముద్రలు తీసుకుంటున్న రేషన్‌షాప్ నిర్వాహకుడు

వేములవాడ: పట్టణంలోని భవానీనగర్‌కు చెందిన వృద్ధురాలు ఉట్కూరి ప్రమీల నడవలేని స్థితిలో ఉండటంతో ఆదివారం రేషన్‌షాప్ నిర్వాహకులు తన ఇంటికే చేరుకుని ఇలా కేవైసీలో వేలి ముద్రలు తీసుకున్నారు. దీంతో వృద్ధురాలు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వలసజీవి ఆత్మహత్య

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మల్కపేటలో కూలీపనులకు వచ్చిన వలసజీవి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన గణేశమూర్తి(28) ఆరునెలల క్రితం మల్కపేటకు వచ్చాడు. గ్రామంలో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణ పనుల్లో కూలీగా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా మద్యానికి బానిసై పనిచేయడంలేదు. మద్యానికి డబ్బు దొరక్కపోవడంతో మనస్తాపానికి గురై తాను కిరాయికి ఉండే ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బావ సత్యరాజ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పర్యాటకంపై పట్టింపేది?

- ఎగువమానేటిలో బోటు ప్రయాణమెప్పుడో?
- ఏళ్లుగా తప్పని ఎదురుచూపులు
- పట్టించుకోని పాలకులు



మూలనపడ్డ బోటు



నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా మార్చుతామన్న పాలకుల మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా ఉంది. జలాశయంలో బోటు ప్రయాణమెప్పుడా.. అంటూ పర్యాటకులు ఎదురుచూస్తున్నారు. ప్రాజెక్టు అన్ని కాలాల్లో నిండుకుండలాగే ఉంటోంది. అయినా మానీటిలో బోటు ప్రయాణం ప్రారంభంకాలేదు.

పట్టించుకోని పాలకులు, అధికారులు

ఎగువమానేరును పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలన్న ఆలోచన స్థానిక నాయకులకు రావడం లేదు. నిజాం కాలంలో నిర్మించిన ప్రాజెక్టు అందాలు చూడాలంటే రెండు కన్నులు సరిపోవు. ఎగువమానేరులో బోటులో ప్రయాణిస్తూ ప్రకృతి అందాలు ఆస్వాదించాలనే పర్యాటకుల వాంఛ తీరడం లేదు. ప్రాజెక్టు సమీపంలో ఏళ్లనాటి గెస్ట్‌హౌస్ ఉంది. ఇటీవల దానికి పాక్షిక మరమ్మతులు చేశారు. గెస్ట్‌హౌస్ పరిసరాల్లో గార్డెన్ ఏర్పాటుకు విశాలమైన స్థలం ఉంది. కానీ ఆ ప్రదేశంలో హరితహారం కింద మొక్కలు నాటుతున్నారు. గతంలో గార్డెన్, వాటర్‌ఫౌంటేయిన్ ఉండేది. ప్రస్తుతం అవి లేవు. ప్రాజెక్టు కట్టపై 'అప్పర్ మానేరు'అనే అక్షరాలు సిమెంటుతో చేసి ఉన్నాయి. వాటిని పట్టించుకునే వారు లేక శిథిలమవుతున్నాయి. గెస్ట్‌హౌస్ వరకు మట్టిరోడ్డే ఉంది. వర్షాకాలంలో కారు వెళ్లడం ఇబ్బందిగా ఉంటోంది.

మూలనపడ్డ బోట్లు

ప్రాజెక్టులో బోటింగ్ కోసం రెండేళ్ల క్రితం తీసుకొచ్చిన బోట్లు మూలకుపడ్డాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు కొంతకాలంగా బోటింగ్ మాటే ఎత్తడం లేదు. బోటింగ్ సౌకర్యం కల్పిస్తామన్న నాయకుల హామీలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉంది. చుట్టూ పచ్చని పొలాలు, చెట్లు ఆపై నీటిలో బోటు ప్రయాణం చేయాలనే పర్యాటకుల కోరిక కలగానే మిగిలిపోతోంది.

వెలమ, రెడ్లు ఓడిపోలేదా..?

- బీసీలకు టికెట్ ఇవ్వాల్సిందే..
- చీటి ఉమేశ్‌రావు సంచలన వ్యాఖ్యలు



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఉమేశ్‌రావు

సిరిసిల్లటౌన్: డిపాజిట్ దక్కని వారికి టికెట్ ఇస్తూ.. బీసీలకు ఇవ్వక పోవడం సరికాదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి వరుసగా వెలమలు, రెడ్లు పోటీలో ఉండి ఓటమిపాలు కాలేదా అని అధిష్టానాన్ని ప్రశ్నించారు. ఆదివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. సిరిసిల్ల నుంచి ఎమ్మెల్యే పోటీకి అర్హులైన బీసీ నేతలున్నారు వారికి టిక్కెట్ ఇస్తే తాను పెట్టుకున్న దరఖాస్తును వాపస్ తీసుకుంటామన్నారు. వరుసగా ఇక్కడి నుంచి పోటీలో ఉంటూ డిపాజిట్ దక్కని వారికి మళ్లీ టికెట్ ఇవ్వొద్దని ప్రజల దృష్టిలో వారు అనర్హులన్న విషయాన్ని అధిష్టానం గుర్తించాలన్నారు. ఇక్కడ కాంగ్రెస్ గెలువాలనే తాను టికెట్ అడుగుతున్నానని పేర్కొన్నారు.

కేటీఆర్ ఖబడ్దార్..

మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ, నేతలపై చేస్తున్న వ్యాఖ్యల భాషను మార్చుకోవాలని ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. తొమ్మిదేళ్లుగా మంత్రిగా ఉంటున్న ఆయన నియోజకవర్గంలోని వీర్నపల్లి మండలంలో ఏళ్లు గడుస్తున్నా అక్కడ ప్రభుత్వ కార్యాలయం లేకుండా ఉందని, ఇదేనా నీవు చేసిన అభివృద్ధి అని ప్రశ్నించారు. ఐటీ మంత్రిగా సిరిసిల్లలో ఎందుకు ఐటీటవర్ కట్టలేదు, సిద్దిపేటలో జరుగుతున్న అభివృద్ధికి దీటుగా సిరిసిల్లను ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. దీనిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల సమస్యలను మేనిఫెస్టోలో పెట్టాలని కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరామని పేర్కొన్నారు. ఆయన వెంట ఎడ్మల భూపాల్‌రెడ్డి, ఆసరి బాలరాజు, ఓరగంటి తిరుపతి, ఆకుల రాజేశం, సంపత్, రెడ్డిమల్ల భాను తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

ముస్తాబాద్(సిరిసిల్ల): బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారని చీటి ఉమేశ్‌రావు అన్నారు. ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లెలో గడపగడపకు కాంగ్రెస్ పథకాలు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టబోయే ఆరు పథకాలను ప్రజలు ముక్త కంఠంతో ఆమోదిస్తున్నారని అన్నారు. చుట్టపు చూపుగా వచ్చిపోయే కేటీఆర్‌కు గుణపాఠం చెప్పాలని, సిరిసిల్ల బిడ్డనే ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వొరగంటి తిరుపతి, ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు అగుళ్ల రాజేశం, కంచర్ల రాజు, రాగుల రాజు, బత్తుల భాస్కర్, భూపాల్‌రెడ్డి తదితరులున్నారు.

లయన్స్‌క్లబ్ ఉత్తమ రైతుగా నరేశ్



కుటుంబ సభ్యులతో చిగురు నరేశ్

ముస్తాబాద్(సిరిసిల్ల): లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఉత్తమ రైతు అవార్డును ముస్తాబాద్ మండలం బందనకల్ రైతు చిగురు నరేశ్ అందుకున్నారు. నిజామాబాద్ జిల్లా వర్నిలో ఆదివారం లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 డీ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ జి.బాపురావు ఉత్తమ రైతులకు సన్మానం చేసి అవార్డులు అందజేసినట్లు నరేశ్ వివరించారు. వరి, చిరుధాన్యాలు, చేపల చెరువు, ఎరువు చల్లే విధానం, అధిక దిగుబడులు వంటి అంశాల్లో తాను సాధించిన విజయాలను గుర్తించారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ఉత్తమ లయన్స్ రైతు అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈసందర్భంగా నరేశ్‌ను ముస్తాబాద్ మండల రైతుసమన్వయ సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, ఎంపీపీ శరత్‌రావు, సర్పంచ్ వెంకటేశ్వరి, రైతులు అభినందించారు.

దారి అడిగి.. ఏమార్చి..

- వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడును ఎత్తుకెళ్లిన యువకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): 'అమ్మా రామలక్ష్మణపల్లెకు వెళ్లాలి.. దారి చెప్పు' అంటూ ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని గుర్తు తెలియని ఇద్దరు యువకులు అడ్రస్ అడిగారు. 'చెప్తా బిడ్డా' అంటూ అరుగు దిగిన వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడును తెంపుకుని బైక్‌పై పరారయ్యారు. బాధితుల కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన బొప్ప మల్లవ్వ(80) శనివారం రాత్రి ఇంటి బయట నిలబడి ఉంది. ఈక్రమంలో అటువైపు ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు.. అమ్మా రామలక్ష్మణపల్లెకు వెళ్లాలే.. దారి చెప్పు అంటూ ఆగారు. మల్లవ్వ దారి చెబుతుండగానే ఓ యువకుడు ఆమె మెడలోని మూడు తులాల (36 గ్రాములు) బంగారు పుస్తెలతాడును తెంపగా, బైక్‌పై ఇద్దరూ పరారయ్యారు. వృద్ధురాలు దొంగ అంటూ అరిచేలోగా కొండాపూర్ వైపు వెళ్లిపోయారు. మల్లవ్వ భర్త చంద్రయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబం ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. గూడెంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

ఆరోగ్యశ్రీ ఈకేవైసీ పేరిట వసూళ్లు

కోనరావుపేట(వేములవాడ): ఆరోగ్యశ్రీ, ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా ఇదే అదనుగా భావిస్తున్న కొందరు సీఎస్సీ సెంటర్ల నిర్వాహకులు ప్రజలనుంచి వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆరోగ్యశ్రీ కార్డులపై ఇదివరకున్న రూ.2 లక్షల మేర ఉచిత వైద్య సదుపాయాన్ని ఒక్కొక్కరికి రూ.5 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రజలందరికీ డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తామని ప్రకటించారు. ఇందుకోసం ప్రజలు దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్‌నెంబర్ వివరాలు సమర్పించి, ఫొటో దిగి అక్నాలెడ్జ్‌మెంట్ నంబర్ పొందాలి. వారికి త్వరలోనే డిజిటల్ కార్డులు అందిస్తారు. ప్రస్తుతం ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ సేవలు ఒకే వ్యవస్థ కిందకు తీసుకవచ్చారు. గతంలో ఆయుష్మాన్ భారత్ ద్వారా ఫొటోలు దిగినవారు ప్రస్తుతం దిగాల్సిన పనిలేదని ప్రకటించారు. కాగా ఉచితంగా చేయాల్సిన ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లోని కామన్ సర్వీస్ సెంటర్ల నిర్వాహకులు ఒక్కో వ్యక్తి నుంచి రూ.50 వసూలు చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలనుంచి నిరసన వ్యక్తమవుతోంది. ఈ విషయమై సీఎస్సీ జిల్లా మేనేజర్ అరుణ్‌ను వివరణ కోరగా, ఇదివరకు గ్రామాల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, ఆరోగ్య శ్రీ ఈకేవైసీ కోసం సీఎస్సీ సెంటర్ల నిర్వాహకులు ఉచితంగా చేయాల్సిందేనని, ఇందుకోసం ఎలాంటి డబ్బులు వసూలు చేసినా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వేధింపులు భరించలేకనే హత్య

- కొడుకును చంపిన తండ్రి రిమాండ్
- వివరాలు వెల్లడించిన సీఐ శశిధర్‌రెడ్డి



సాయిలు అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మద్యానికి బానిసై కొంతకాలంగా డబ్బుల కోసం వేధించడం, కుటుంబ సభ్యులపై తరచూ దాడులు చేసి హింసించడాన్ని తట్టుకోలేక కన్నకొడుకును తండ్రి హతమార్చాడు. ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ కార్యాలయంలో సీఐ శశిధర్‌రెడ్డి ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామానికి చెందిన కుంట రమేశ్ గతంలో విద్యుత్‌శాఖలో లైన్‌మెన్‌గా పని చేశాడు. మద్యానికి బానిస కావడంతో అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో మరింతగా మద్యానికి బానిసైన రమేశ్ అప్పుడప్పుడు కుల వృత్తిలో భాగంగా చేపల వేటకు వెళ్లి వచ్చిన డబ్బుతో మద్యం సేవిస్తూ.. తండ్రి సాయిలు, అంధురాలైన తల్లి మల్లమ్మ, అంగవైకల్యంతో బాధపడుతున్న సోదరుడు సత్యనారాయణను డబ్బుల కోసం వేధించసాగాడు. వారి పెన్షన్ డబ్బులు కూడా బలవంతంగా తీసుకునేవాడు. కొడుకు వేధింపులు భరించలేక తండ్రి విసిగిపోయాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం నిద్రలో ఉన్న రమేశ్ తలపై గొడ్డలితో తండ్రి దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సాయిలును ఆదివారం లింగాపూర్ బస్టాండ్‌లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. సమావేశంలో గంభీరావుపేట ఎస్సై మహేశ్ ఉన్నారు.

నిమజ్జనం వేళ యువకులపై లాఠీచార్జి?

- సామాజిక మాధ్యమాల్లో వైరల్



నిమజ్జన సమయంలో లాఠీతో యువకులను కొడుతున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: వినాయక నవరాత్రుల సందర్భంగా కొందరు పోలీసులు యువకులపై లాఠీచార్జి చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. గతనెల 28న మధ్యాహ్నం వినాయక నిమజ్జనం 3 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటలకు పూర్తి చేయాలని పోలీసు అధికారులు ముందుగానే పీస్ కమిటీ సమావేశం నిర్వహించి ఆదేశించారు. దానికి అనుగుణంగా బందోబస్తు నిర్వహించారు. కానీ జిల్లా కేంద్రంలోని పలు వినాయక మండపాల నిర్వాహకులు నిమజ్జన కార్యక్రమాన్ని ఆలస్యంగా ప్రారంభించారు. కొందరు మరుసటి రోజు నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. ఈక్రమంలో నిమజ్జనం సమయంలో కొందరు యువకులపై పోలీసులు బందోబస్తు పేరిట విధుల్లో ఉండి లాఠీచార్జి చేశారని గతనెల 29న చర్చ జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు బయటపెడితే పోలీసులు తమపై కేసుల నమోదు చేస్తారన్న భయంతో అందరూ మిన్నకున్నారు. కాగా రెండురోజుల తర్వాత యువకులపై లాఠీ ఝళిపించిన వీడియో బయటకు రావడంతో పోలీసులపై స్థానికంగా విమర్శలు వస్తున్నాయి. ఇక రాజకీయ నేతలైతే మంత్రి కేటీఆర్ ఇలాఖాలో ఇలాంటి చర్యలు సరికాదని విమర్శలు గుప్పిస్తున్నారు. ఏదైనా ఉంటే సర్దుబాటు ధోరణిలో వెళ్లాలి కానీ లాఠీలకు పని చెప్పి ఫ్రెండ్లీ పోలీసు విధానాలను తుంగలో తొక్కినట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు దళిత మహిళ ఫిర్యాదు



బాధితురాలు లక్ష్మి

చందుర్తి(వేములవాడ): తన భూమిని ఓ వ్యక్తి ఆక్రమించి వేధింపులకు గురి చేస్తున్నాడని చందుర్తి మండల కేంద్రానికి చెందిన దళిత మహిళ మేడికాల లక్ష్మి జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బాధితురాలి వివరాల ప్రకారం.. లక్ష్మి భర్త చనిపోయిన తర్వాత తన వ్యవసాయ భూమి 0.34 గుంటలను ఆక్రమించారని, దీనిపై రెవెన్యూ అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, చివరకు పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి యత్నించగా పోలీసులు అడ్డుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎనిమిదేళ్ల నుంచి ఇప్పటి వరకు ఏ అధికారి తమకు న్యాయం చేయకపోవడంతో వారం క్రితం జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు మెయిల్ ద్వారా తమకు సమాచారం వచ్చిందని బాధితురాలు పేర్కొన్నారు.

ఎరువులు పంపిణీ చేయకుండానే వేలిముద్రలు?



నిమ్మపల్లిలో రైతు వేలిముద్రలు తీసుకుంటున్న సీఈవో

కోనరావుపేట(వేములవాడ): రైతులకు ఎరువులు పంపిణీ చేయకుండానే పంపిణీ చేసినట్లు నమోదు చేస్తున్నారు కోనరావుపేట సింగిల్‌విండో సిబ్బంది. మండలంలోని కోనరావుపేట, నిమ్మపల్లి గ్రామాల్లో సీఈవో కేశవులు తిరుగుతూ రైతుల వేలిముద్రలు సేకరిస్తూ ఆన్‌లైన్ చేస్తున్నారు. కాగా గ్రామాల్లో గత కొన్ని రోజులుగా ఎరువులే పంపిణీ చేయలేదు. ఎరువులు పంపిణీ చేయకుండా వేలిముద్రలు ఎందుకు తీసుకుంటున్నారని పలువురు సీఈవోను ప్రశ్నించారు. ఈ విషయమై సింగిల్‌విండో సీఈవో కేశవులును వివరణ కోరగా రైతులకు ఇదివరకే ఎరువులు పంపిణీ చేశామని, సిగ్నల్ లేకపోవడంతో ఆన్‌లైన్ చేయలేకపోయామని, ఇప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నామని పేర్కొన్నారు.

నేరెళ్ల బాధితులను కలిసిన ఢిల్లీ వ్యాసకర్త



నేరెళ్ల బాధితులతో మాట్లాడుతున్న సుజాత

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని నేరెళ్ల గ్రామంలో ఆదివారం ఢిల్లీకి చెందిన కరవన్ మ్యాగజీన్ వ్యాసకర్త సుజాత పర్యటించారు. ఈ సందర్భంగా నేరెళ్ల ఘటన బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మట్లాడుతూ, ఏఐసీసీ ఆదేశాల మేరకు నేరెళ్ల బాధితుల దీనస్థితి గూర్చి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, సిరిసిల్ల టౌన్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, జిల్లా మహిళా ప్రెసిడెంట్ వనిత, జిల్లా ఎస్సీ అధ్యక్షుడు బాలరాజు, మండల ఎస్సీ అధ్యక్షుడు నాగరాజు, మహిళా అధ్యక్షురాలు హారిక, కోల శంకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'మీ ఆడబిడ్డగా ఆశీర్వదించండి'



తుల ఉమను సన్మానిస్తున్న యాదవ సంఘం

చందుర్తి(వేములవాడ): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలుస్తానని, మీ ఆడబిడ్డగా తనను ఆశీర్వదించి, భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ కోరారు. ఆదివారం చందుర్తి మండలం జోగాపూర్, రామన్నపేట, తిమ్మాపూర్ గ్రామాల్లో కుల సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. వేములవాడ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా టికెట్ తనకే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే రామన్నపేటలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొని రోడ్డుపై చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించారు. మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, మహిళ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలొచ్చాయ్



చీరలు అన్ లోడ్ చేస్తున్న కూలీలు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయానికి బతుకమ్మ చీరలు ఆదివారం చేరాయి. బతుకమ్మ పండగకు ఏటా ప్రభుత్వం చీరలను పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈమేరకు ఆయా గ్రామాలకు చీరలను అందించేందుకు ముందుగా మండల పరిషత్ కార్యాలయానికి చీరలను తరలించారు. మండలానికి 17వేల బతుకమ్మ చీరలు వచ్చాయని ఐకేపీ అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో లబ్ధిదారులకు చీరల పంపిణీ చేపడుతారని పేర్కొన్నారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్

సిరిసిల్లఅర్బన్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగ ఖాళీలను గుర్తించి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో మాట్లాడారు. నిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన అన్ని నోటిఫికేషన్ల పేపర్స్ లీక్ అయ్యాయని, వాయిదాలు పడ్డాయన్నారు. ప్రభుత్వం వెంటనే టీఎస్‌పీఎస్సీ బోర్డు చైర్మన్‌ను తొలగించి ప్రక్షాళన చేయాలన్నారు. అలాగే గురుకుల పాఠశాలలకు భవనాలు నిర్మించి, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు కొప్పు అభిలాష్, నాయకులు రాణాప్రతాప్, శ్రీకాంత్, విజయ్‌కుమార్, రోహిత్ తదితరులు ఉన్నారు.

'ప్రజా సమస్యలపై పోరాడుతా'

సిరిసిల్లఅర్బన్: పార్టీ కోసం కాదు విలీన గ్రామ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతానని బీజేపీ ఫ్లోర్ లీడర్, 10వ వార్డు కౌన్సిలర్ బొల్గం నాగరాజ్‌గౌడ్ అన్నారు. ఆదివారం చిన్నబోనాలలో మాట్లాడారు. శనివారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో విలీన గ్రామాల సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలుపగా, విలీన గ్రామాల బీఆర్ఎస్ కౌన్సిలర్లు తనపై చేసిన వాఖ్యలు సరికాదన్నారు. అభివృద్ధి అంటే సీసీ రోడ్లు, డ్రైనేజీలు కాదని, గ్రామాల్లో ఎన్నో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రూ.250 ఉన్న ఇంటి పన్ను వెయ్యికి పైగా పెరిగిందని, నల్లా పన్ను, ఇంటి పర్మిషన్లకు వేల కొద్ది చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 2వేలకు పైగా మంది ఉపాధి కోల్పోయారని, వీరందరికి ఉపాధి కల్పించే మార్గం చూపాలన్నారు. తన వార్డుకు రూ.2.50 కోట్లు విడుదల చేసిన నిధులకు సంబంధించి శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. విలీన గ్రామాల అభివృద్ధికి తాను రాజీనామకైనా సిద్ధమని, మీరు సిద్ధమా అని ప్రశ్నించారు. ఏ గ్రామంలో పూర్తి స్థాయి అభివృద్ధి జరిగిందో ఆయా గ్రామాల కౌన్సిలర్లు చూపెట్టాలని డిమాండ్ చేశారు.